# కార్తీక దీపం

'అరుంధతి'

"ఒరేయి బాబూ! లేవరా!"

"కాస్సేపు వుండు బామ్మా!"

"ఇంకా కాస్సేపేమిట్రా. ఐదుకొట్టింది. లేవరా బాబూ!"

"చలి గడ్డ కట్టిస్తుంటే! ... మంచంమీదనుండి లేవడానికే ప్రాణాలు పోతున్నాయి ... ఇప్పుడు యీ స్నానం యెందుకమ్మా! ... తెలవారి యెండ వచ్చిన తర్వాత చేద్దువుగాని - కాస్సేపు పడుకో."

"కార్తీక స్నానం యెండవచ్చిన తర్వాత చెయ్యడమేమిట్రా బాబూ - లేవరా!"

"లేవాలంటావా! కాళ్లు చేతులు కొయ్యబారి పోతున్నాయి."

"ఇంకొక్క పదిహేను రోజులు కష్టపడరా నాయనా! లేవరా!"

"నేనొస్తాను నడవండి. వాడు లేవడింక. మొండి ..." అంటూ మా అమ్మ వచ్చింది.

"చంటిపిల్ల తల్లివి నువ్వెక్కడికి వస్తావు యీ గాలిలో. వాడే వస్తున్నాడు. లేవరా బాబూ! మీ నాన్న లేడురా. ఊళ్లోవుంటే వాడే వచ్చేవాడు ..."

తప్పదురా భగవంతుడా అనుకుంటూ కప్పుకున్న వులన్ రగ్గుతీసి లేచేసరికి చలికి కాళ్లుచేతులు వణికి పోవడం మొదలు పెట్టాయి. ఇంట్లో ముసలాళ్లు వుంటే ఒకటి - లేకపోతే మరొకటి! నెమ్మదిగా మఫ్లర్ తీసి తలకుచుట్టి బామ్మ సరంజామా, వెన్నెలగా నేవున్నా లాంతరు (మా బామ్మకు కళ్ళు సరిగ్గా కనిపించవులెండి!) చిన్న చేతికర్ర పుచ్చుకుని బామ్మ వెనకాలే గోదావరికి బయల్దేరాను.

అసలు నిజం చెప్పాలంటే గోదావరి మా యింటికి సరిగ్గా ఒక ఫర్లాంగు. అయితే కప్పుకున్న ముసుగు తీసేసరికే ప్రాణాలు పోతుంటే - యీ ఫర్లాంగు దూరం నడిచేదెలాగ అన్న విషయం అటుంచి, అసలు మా బామ్మే కార్తీకదీపంలాగ గాలికి రెపరెప కొట్టుకుంటూ యెప్పుడు ప్రాణంపోతుందా అన్నట్లుగా వుంటే - శుభ్రంగా తెల్లవారిన తర్వాత హాయిగా బిందెడు వేన్నీళ్ళు స్నానంచేసి - కోడలు వండిపెడుతుంటే తిని - కృష్ణా రామా అనుకుంటూ యింట్లో కూర్చోక ఆవిడకీ కార్తీక స్నానాలు యివన్నీ యెందుకో! అన్నదే నాపాయింటు.

అబ్బ! ఏం చలి! కొరికేస్తోంది! కార్తీక స్నానాలు చేసి తర్వాత యే స్వర్గానికి వెడతారో కాని - మొదట యీ చలిలో నరకం మాత్రం అనుభవిస్తున్నారనిపించింది. అవును మరి, కాకపోతే యేమిటి చెప్పండి! హాయిగా ముసుగు తన్ని పెట్టి కడుపులో కాళ్ళు పెట్టుకొని వెచ్చగా పడుకోక - యెందుకొచ్చిన తిప్పలివి! ... పోనీ! ఆ విడకు తెలియకపోతే మా నాన్నకైనా తెలియక్కర్లేదూ? పైగా ఆయనే రోజూ ఆవిణ్ణిలేపి స్నానానికి తీసుకు వెడతాడు ... ఏమిటో - యింత కష్టపడే బదులు ఒక్కసారి ఆ రష్యావారి స్పూట్నిక్ లో ప్రయాణం చేస్తే చంద్రలోకం, సూర్యలోకం కూడా చూచి రావచ్చుగా - అనుకుంటూ యేదేదో ఆలోచనా సముద్రంలో మునిగిపోయాను.

ఇంతలో బామ్మ వెనక్కు తిరిగి, "ఒరేయి బాబూ! వస్తున్నావా? మెలుకువగా వున్నావా - కునికిపాట్లు పడుతున్నావా?" అంది.

"మెలుకువగానే వున్నాను - కాని చలిమాత్రం చంపేస్తోంది. నువ్వు స్నానం యెలా చేస్తావో!"

"ఒక్కసారి నీళ్ళలో మునిగితే యే చలి వుండదు. నువ్వుకూడా ప్రతిరోజూ తెల్లవారుఝామునే లేచి స్నానం చెయ్యకూడదూ! ఆరోగ్యంగా వుంటుంది ..."

"ఆరోగ్యంమాట అటుంచి - జలుబుచేసిందంటే చీదుకోలేక చావాలి... ఉన్న ఆరోగ్యం చాలు..."

ఇంతలో గోదావరికి వచ్చేశాం. ఒకళ్ళా - యిద్దరా ... ఆ ముసలమ్మలను చూస్తుంటే - వాళ్ళకు వణికిపోయే యీ స్నానాలు, చేస్తున్నారో కాని - నాకు మాత్రం నిజంగా వణికిపోయింది.

"బాబూ - ఆ వత్తులపెట్టె, కుంది అక్కడపెట్టి, ఆ పంచి యిలా యివ్వు" అంటూ పంచితీసుకుని, తనలో తానే యేదేదో గొణుక్కుంటూ జరజరా నీళ్ళలో ప్రవేశించింది.

"ఏం వెంకమ్మగారూ - యీ వాళ మనవణ్ణి తీసుకొచ్చారు. అబ్బాయి క్యాంపు కెళ్ళాడా?" అంటూ యెదరింటి ముసలావిడ ప్రారంభించింది. నన్ను మాత్రం గట్టుమీద చలి గడ్డకట్టిస్తోంది. అటు యిటు చూచాను. నా ప్రక్కనే నిలబడింది - యెవ్వరో కాదు - ప్రక్కింటివారి నిర్మల! నా ముఖంలోకే చూస్తోందని గ్రహించాను. ఇంతలో గుడ్డిదీపం కాస్తా గోదావరి గాలికి రెపరెపలాడి ప్రాణాలు విడిచింది పాపం! నీళ్ళలో ముసలమ్మలు మునుగుతున్నారు - తేలుతున్నారు - కాని నిర్మల మాత్రం అలాగే చూస్తోంది నా ముఖంలోకి. నవ్వుదామని ప్రయత్నించింది. కాని యెందుకో ఆగిపోయింది. అదంతా నా భ్రమే అనుకున్నాను! అయితే, నిర్మలను చూచేసరికే నా చలి సగం తగ్గిపోయినట్లనిపించింది. పలుకరిద్దామంటే మాత్రం నోరు విడివడలేదు. పైగా నోరు తెరిస్తే అసలే కాళ్ళు చేతులు వణికిపోతున్నాయి - వాటికి సాయం నోరుకూడా వణకడం ప్రారంభించిందంటే - నిర్మల నవ్వుతుందేమో నన్న భయం! అలాగే నోరు బిగించి నిర్మల ముఖంలోకి చూస్తూ నిలబడ్డాను. నిర్మలకు చలి లేనట్లుగా వుంది!

"ఈ వాళ నువ్వొచ్చావేం?" అంది ఆఖరికి. నోరు తెరవక తప్పలేదు, "అదృష్టమో - దృష్టమో మా నాన్న క్యాంపుకెళ్ళాడు" అనగలిగాను.

"అంటే..."

"అంటే యేమీ లేదుకాని ... నీకు చలివెయ్యటం లేదూ?"

"చలి - నాకు అలవాటైపోయింది!"

"అంటే - రోజూ వస్తున్నావన్నమాట!"

"ఆ. మీ నాన్న యెప్పుడొస్తారు?"

"కార్తీకమాసం ఆఖరయిన తర్వాత"

"అంటే అంతవరకు నువ్వే వస్తావన్నమాట"

"నువ్వు రావా?"

"ఏం?" అంటూ నవ్వింది.

"ఏం లేదుగాని ... మాట్లాడం పూర్తిగా మానేశావేం?"

"నిన్న నేగా మీ చెల్లెలితో చింతగింజలు ఆడేటప్పుడు మాట్లాడింది. పైగా ఎదరింటి సుబ్బమ్మ చూచిందంటే - యిక చెప్పాలా! ఆవిడనోరు ఆలిండియా రేడియో! అంతటితో వూరుకోదు - ఉన్నదీ లేనిదీ కల్పిస్తుంది. మొన్న ఎగ్జిబిషన్‌లో యెక్కడ చూచిందో కాని కాకిచెప్పలా అంటించేసింది."

మేమీ కబుర్లలో పడ్డాం - మా బామ్మ అప్పుడే స్నానం, అన్నీ పూర్తి చేసుకుని, "బాబూ వెడదామా" అంది.

"దీపం పెట్టుకోవడం అన్నీ పూర్తి అయ్యాయా బామ్మ" అన్నాను యింకా ఆలస్యముందేమోనని. అబ్బే! అన్నీ పూర్తయ్యాయి హా భగవంతుడా! అనుకుంటూ, నిర్మలముఖంలోకి చూచి మూగవాడిలా ప్రక్కకు తిరిగాను.

"రేపు వస్తావుకదూ!" అంటూ చెవిమీద గిల్లింది. వెనక్కు తిరిగి చిరునవ్వుతోనే సమాధానమిచ్చి బామ్మ వెనకాలే బయల్దేరాను.

"వాళ్ళ నిర్మల చూడరా! నీకన్న చిన్నది, బామ్మను తీసుకుని రోజూ వస్తుంది. నువ్వేమో ముసుగే తియ్యనంటావు"

"తెల్లవారు ఝామునే రేపు - నేనూవస్తాను" అని నాలోనేనే నవ్వుకున్నాను.

రోజూ పడుక్కునేముందు బామ్మతో చెప్పే వాణ్ణి - నాలుగున్నరకి అలారం కొట్టగానే లేపమని. ఆ రోజు - కార్తీక మాసం ఆఖరు. నేనూ బామ్మా బయల్దేరాం. రోడ్డుమలుపులో ప్రక్కింటి సీతమ్మ గారు కనబడింది. నిర్మల లేదు.

"ఏం - ఒక్కరూ వస్తున్నారు? మనవరాలు రాలేదా?" అంది బామ్మ. ఏం చెప్తుందో యేమోనని నా గుండెలు కొట్టుకోవడం మొదలుపెట్టాయి.

"వత్తులపెట్టె మర్చిపోయింది. మళ్ళీ వెనక్కి వెళ్ళింది... సరేగాని నిర్మలను మనవడికి యెప్పుడు చేసుకుంటారు?" అంటూ నవ్వింది.

"మీ రెప్పుడు ముహూర్తం పెట్టిస్తే అప్పుడు"...

"మనవడికి యిష్టమేనా? ... ఏమయ్యా..." అంటూ యేదో అనబోయింది.

"వాడి మొఖం - వాడికేం తెల్సు. అయినా యీ కాలం వాళ్ళకు అంగచందాల సంగతి యేం తెలుసు?"

"ఇంతలో నిర్మల రానే వచ్చింది." ఏమే పిల్లా మా వాణ్ణి చేసుకుంటావుటే" అంది బామ్మ నవ్వుతూ.

"ఆ! దాని ముఖం - దానికేం తెల్సు. మనం యెంత చెప్తే అంత!"

ఇంతలోనే గోదావరి చేరాం. ముసలమ్మ లిద్దరూ నీళ్ళలో దిగారు. మేమిద్దరం గట్టుమీద యిసుకలో కూర్చుని నవ్వుకుంటూ బామ్మ చెప్పిన విషయం గురించి మాట్లాడుకొంటున్నాం. ఆమె శరీరపు వెచ్చదనానికి ఉన్న చలి కాస్తాపోయి ఉష్ణ ప్రపంచంలో ఉర్రూతలూగుతూ, పరమానందంతో పరవశం చెందుతూ, బామ్మ స్నానంచేసి దీపం పెట్టుకుంటోందన్న సంగతికూడా గ్రహించలేదు.

"బాబూ, రారా! ఆఖరురోజు - దణ్ణం పెట్టుకో!" అనగానే ఉలిక్కిపడి లేచాం. సీతమ్మ గారు కూడా బామ్మ ప్రక్కనే దీపం పెట్టుకొంటున్నారు. ఇద్దరం నమస్కరించి తలపైకెత్తేసరికి - ఝుం కేస్తుంది! యెదురుగా యెదురింటి సుబ్బమ్మ సిద్ధం. - ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది. ఆక్షణంలో ఆవిణ్ణి చూడగానే అమాంతంగా నమలకుండా మింగేద్దామా అన్నంత కోపం వచ్చింది. అపశకున పక్షి!

ఆ తర్వాత కొద్ది దినాలకే నిర్మలతో నా వివాహం జరిగింది. అంతా ఒక నాటకంలా జరిగిపోయింది. నాన్నగారికి విశాఖపట్నం ట్రాన్స్ఫరయింది. నేను, నిర్మల, బామ్మ రాజమండ్రిలోనే వుండిపోయాం.

తర్వాత ఒకనాడు రాత్రి భోజనాలయ్యాక నిర్మల నవ్వుతూ అంది - "ఏమండోయ్! రేపటి నుండి కార్తీకమాసం ప్రారంభం" ఆ మాట వినేసరికి నా గుండె ఝల్లుమంది - చచ్చానురా భగవంతుడా అనిపించింది.

"బామ్మను విశాఖపట్నం పంపించేద్దామేమిటి" అన్నాను నెమ్మదిగా.

"ఛా వూరుకోండి. ఎవరైనా వింటే నవ్విపోతారు. ఏమనుకుంటారు? పెళ్ళాం పక్కలోనుండి లేవడం బద్ధకమైందనుకోరూ! అయినా ..., ఏమండి ఆ విధవల్లనేకదా నిరుడు గోదావరికి రాగలిగారు ..." అంటూ నవ్వుతూ కళ్ళలోకి చూచింది.

తప్పదురా నాయనా అనుకుంటూ మంచంమీద ఒరిగాను. మామూలుగానే బామ్మ నాలుగుగంటలకు లేచి నిర్మలను లేపి "నిర్మలా! నేను స్నానానికి వెళుతున్నాను. తలుపు దగ్గరగా వేసి వెళ్తున్నాను." అంది.

'హమ్మయ్య' అనుకున్నాను. కాని నిర్మల లేచి పోతూ. "ఉండండి ఆయన వస్తున్నారు. బైట చీకటిగా వుంది."

"ఎందుకు - అక్కరలేదు. వాణ్ణి పడుకోని నేను వెళ్ళివస్తాను." అంటుంటే "మీరు వెడతారా - నన్ను వెళ్ళమన్నారా?" అంది నిర్మల.

చలి కొరుక్కుతింటున్నా వెళ్ళక తప్పలేదు. బామ్మ కార్తీక దీపానికి ఆయుష్షెక్కువ!